సాక్షి
తిరుపతి

బుధవారం ׀ 23 ׀ అక్టోబర్ ׀ 2024



యథేచ్ఛగా ఇసుక దోపిడీ

ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. స్వర్ణముఖి నది నుంచి యథేచ్ఛగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. - 8లో



విద్యుత్ బస్సులపై ఢిల్లీ పెత్తనం

ప్రయివేటు బస్సుల నిర్వహణ ఢిల్లీకి చెందిన ఎస్అండ్‌ఏ ప్రొటెక్షన్ సొల్యూషన్ ప్రయివేట్ లిమిటెడ్‌కు కట్టబెట్టారు. - 8లో



అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

ఆంధ్ర, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో కుటుంబ సమేతంగా దొంగతనాలకు పాల్పడే ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ఐదో దఫా ప్రవేశాలకు ఆన్‌లైన్లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, కన్వీనర్ వీ.శ్రీలక్ష్మి తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5గంటలలోపు 'ఐటీఐ.ఏపీ.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులు తాము చేరదలచిన ఐటీఐ కళాశాలను వెబ్‌సైట్లో ఆప్షన్ పెట్టుకుని ఆ తరువాత సమీపంలోని ఏదేని ప్రభుత్వ ఐటీఐ కళాశాలకెళ్లి సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 28న ప్రభుత్వ ఐటీఐలో చేరదలచిన వారికి, 30న ప్రైవేటు ఐటీఐలో చేరదలచిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, దీనికి సంబంధించి అభ్యర్థులకు ఎటువంటి కాల్ లెటర్లు పంపబడవని పేర్కొన్నారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలకు 85000 21856, 94908 06942 నంబర్లలో సంప్రదించాలని కన్వీనర్ కోరారు. అలాగే తిరుపతి ప్రభుత్వ ఐటీఐలో వుడ్ వర్క్ టెక్నీషియన్ కోర్సుకు 8వ తరగతి పాసైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపల్ తెలిపారు.

భూసమస్యలపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: రహదారుల నిర్మాణం, రైల్వేకి సంబంధించిన భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జాతీయ రహదారులతోపాటు రైల్వేకి సంబంధించి భూసమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన పలు అంశాలపై జేసీ శుభం బన్సల్, ఇతర అధికారులతో కలిసి సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గడువులోపు అన్ని అంశాలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. కడప- రేణిగుంట, రేణిగుంట-నాయుడుపేట, తిరుపతి బైపాస్‌కి సంబంధించి కాలూరు క్రాస్ నుంచి రేణిగుంట వరకు రహదారి పనులు వేగవంతం చేయాలన్నారు. రేణిగుంట-చెన్నై రహదారి విస్తరణ పనులకు సంబంధించి భూ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అలాగే వివిధ రహదారుల నిర్మాణానికి అడ్డుగా ఉన్న భూ సమస్యలపై దృష్టిపెట్టాలని చెప్పారు. తిరుపతి జిల్లా జాతీయ రహదారుల పీడీ వెంకటేశ్వర్లు, నెల్లూరు పీడీ ఎంకే.చౌదరి, చెన్నై పీడీ రవీంద్రరావు, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, తిరుపతి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి ఆర్డీవోలు రామ్మోహన్, కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డి, జిల్లా సర్వేయర్ అరుణ్, పలువురు తహసీల్దార్లు, సర్వేయర్లు కలెక్టరేట్ డీటీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించండి

తిరుపతి అర్బన్: ఆర్టీసీ విభాగంలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులకు మెడికల్ ఇన్వ్యాలిడేషన్ మంజూరైనట్టు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ఆర్టీసీకి చెందిన ఒక ఉద్యోగి క్యాన్సర్‌తోను, మరో ఉద్యోగి పక్షవాతంతో బాధపడుతున్న నేపథ్యంలో కమిటీకి వివరాలను పంపించామని చెప్పారు. అయితే కమిటీ ఆ ఇద్దరు ఉద్యోగులకు మెడికల్ ఇన్వ్యాలిడేషన్ మంజూరు చేసినట్లు స్పష్టం చేశారు. ఆ మేరకు వారి కుటుంబ సభ్యుల విద్యార్హతను బట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డీపీటీఓ జగదీష్‌కు సూచించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ శ్రీహరి, కలెక్టరేట్ ఏఓ భారతి, సెక్షన్ డీటీ ఉషారాణి పాల్గొన్నారు.

చంద్రగిరిలో భారీ వర్షం



ఎడతెరిపి లేకుండా పడుతున్న వాన

చంద్రగిరి: చంద్రగిరిలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. భారీ గాలులు, ఉరుములు, మెరుపులతో సుమారు రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం పడింది. కాలువలు, వాగులు పొంగి ప్రవహించాయి. చంద్రగిరి పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండల వ్యాప్తంగా ప్రజలు విద్యుత్ లేక అవస్థలు పడ్డారు. చంద్రగిరి పాతపేటలోని జోగుల కాలనీలో భారీ వర్షానికి విద్యుత్ స్తంభం నేలకొరిగింది. సమాచారం అందుకున్న విద్యుత్‌శాఖ ఈఏ నాగరాజు ఘటనా స్థలానికి చేరుకుని యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు.

నకిలీలలు!

జిల్లాలో నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందులు రాజ్యమేలుతున్నాయి. ప్రముఖ బ్రాండ్ల పేరుతో రైతును బోల్తా కొట్టిస్తున్నాయి. నేల తల్లినే నమ్ముకున్న అమాయక అన్నదాతను నట్టేట ముంచేస్తున్నాయి. వేలకు వేలు అప్పులు చేసి పంటలు పెట్టినా ఆశించిన దిగుబడి రాక కన్నీళ్లే మిగిల్చుతున్నాయి. ఈ క్రమంలో వీటిపై నిఘా పెట్టాల్సిన అధికారులు మామూళ్లకు అలవాటుపడి అటువైపు కన్నెత్తి చూడలేదన్న విమర్శలు చక్కర్లు కొడుతున్నాయి. రబీ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ఏ విత్తనాలు కొనాలో.. ఏ పురుగు మందు వాడాలో తెలియక పలువురు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.





జిల్లాలో విచ్చలవిడిగా నాసిరకం పురుగు మందులు
- హైదరాబాద్ శివార్ల నుంచి దిగుమతి
- ప్రముఖ బ్రాండ్ల పేరుతో విక్రయాలు
- నిలువునా మోసపోతున్న అన్నదాతలు

తిరుపతి అర్బన్: జిల్లాలో నకిలీ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. పాలకుల ఉదాసీనత.. అధికారుల అలసత్వం వెరసి అన్నదాతను నిలువునా ముంచేస్తున్నారు. ఇటీవల వరదయ్యపాళెం మండలంలో నకిలీ వరి విత్తనాలు మొలకెత్తకపోయినా సంబంధిత అధికారులు నోటీసులిచ్చి మిన్నకుండిపోయారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా నకిలీ పురుగు మందులు రాజ్యమేలుతున్నా వాటిపై ఎలాంటి నిఘా ఉంచడంలేదని విరుచుకుపడుతున్నారు.

రబీలో రూ.200 కోట్ల వ్యాపారం

జిల్లాలో అక్టోబర్ 1 రబీ సీజన్ కొనసాగుతుంది. పంటలకు తెగుళ్ల నివారణ కోసం పురుగు మందులు పిచికారీ చేయాల్సి ఉంటుంది. కేవలం 2శాతం మినహా 98 శాతం పంటలకు రసాయనిక మందులనే పిచికారీ చేస్తున్నారు. రబీ సీజన్‌లో వరి పంటకు నాట్లు నుంచి కోత వరకు మూడు నుంచి నాలుగు సార్లు పురుగు మందులను పిచికారీ చేయాల్సి ఉంటుంది. ఎకరాకు ఒక్క సారికి లీటర్ చొప్పున మూడు సార్లకు 3 లీటర్లు వాడాల్సి ఉంటుంది. ఈ లెక్కన 2 లక్షల ఎకరాలకు 6 లక్షల లీటర్లు పిచికారీ చేస్తున్నారు. అంతేకాకుండా లక్ష కేజీల గుళికలు వాడేస్తున్నారు. మరోవైపు వివిధ రకాల రసాయనిక పౌడర్లు 50వేల కిలోలను వినియోగిస్తున్నారు. మొత్తంగా చూస్తే ఒక్క పురుగు మందుల కోసమే జిల్లాలో రూ.60 కోట్ల మేర ఖర్చు చేస్తున్నారు. వీటితోపాటు ఎరువులు, విత్తనాలు కలుపుకుంటే రూ.200 కోట్ల వ్యాపారం సాగుతోంది.

క్యూ ఆర్ కోడ్‌తో మోసానికి అడ్డుకట్ట

క్యూఆర్ కోడ్ ద్వారా రైతులు పురుగు మందుల మోసాన్ని అడ్డుకోవచ్చు. ప్రధానంగా ప్రముఖ కంపెనీల పురుగు మందులు కొనుగోలు చేసేటప్పుడు డబ్బాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను యాప్ ద్వారా స్కాన్ చేస్తే అది అసలైందా.. కాదా? అనే విషయాన్ని తెలుసుకోవచ్చు. ఈ పరిజ్ఞానం తెలియకపోతే వ్యాపారిని కచ్చితంగా స్కాన్ చేసి చూపించాలని కోరాల్సి ఉంది. వాస్తవాలను నిర్ధారించుకున్న తరువాతే పురుగు మందులను కొనుగోలు చేయాలి.

30 రోజుల్లోనే లైఫ్‌లాంగ్ లైసెన్స్

బీఎస్సీ కెమిస్ట్రీ, అగ్రికల్చర్ బీఎస్సీ, డిప్లొమా అగ్రికల్చర్ వీటిలో ఏదైనా డిగ్రీ ఉంటే పురుగుమందుల దుకాణం నిర్వహించుకోవడానికి లైసెన్స్ ఇచ్చేస్తారు. దుకాణం నడుపుకోవడానికి జీఎస్టీ నంబర్ ఉండాలి. రూరల్ ప్రాంతాల్లో కేవలం రూ.1,500 చెల్లిస్తే సరిపోతుంది. అర్బన్ ప్రాంతాల్లో రూ.7,500 చెల్లిస్తే చాలు. లైఫ్‌లాంగ్ పురుగుమందుల దుకాణం పెట్టుకోవచ్చు. అయితే లైసెన్స్ తీసుకున్న వారిలో 70శాతం మంది పురుగు మందుల దుకాణాలు నడపడం లేదు. వారు ఏదో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. వారి పేర్లపై లైసెన్స్ తీసుకుని.. పురుగు మందులపై అవగాహన లేని ఇతర వ్యక్తులు ఇష్టారాజ్యంగా నకిలీ వ్యాపారం చేస్తున్నట్లు తెలుస్తోంది.

అక్కడి నుంచే దిగుమతి

హైదరాబాద్ నగర శివార్లలో బయో ఉత్పత్తులు తయారు చేసే పలు కంపెనీలున్నాయి. వీటి మాటున కొంతమంది నకిలీలు తయారు చేసి మార్కెట్లోకి వదులుతున్నారు. అక్కడి నుంచి నుంచి రెగ్యులర్ పార్సిల్ సర్వీసుల్లో కాకుండా శివారు ప్రాంతాలకు వివిధ సామగ్రి చేరవేసే ట్రాన్స్‌పోర్టు కంపెనీల ద్వారా నెల్లూరు, గుంటూరు, కృష్ణ జిల్లాలకు అధికంగా పంపుతున్నారు. అక్కడి నుంచి తిరుపతి జిల్లాకు దిగుమతి చేస్తున్నారు. ఇందులో ప్రముఖ కంపెనీలకు చెందిన, భారీగా డిమాండ్ ఉన్న పురుగుమందుల డబ్బాలను పోలినవి ఉండడం.. డబ్బాల్లో తేడా లేకపోవడం, ఎప్పుడూ కొనుగోలు చేసే దుకాణాల్లోనే వాటిని విక్రయిస్తుండడంతో రైతులు కొనుగోలు చేసి నిలువునా మోసపోతున్నారు.



నిఘా పెంచుతాం

"రబీ సీజన్ అక్టోబర్ 1 నుంచే జిల్లాలో మొదలైంది. ఈ క్రమంలో పురుగు మందుల దుకాణాలతోపాటు విత్తనాలు, ఎరువుల దుకాణాలపై తనిఖీలు చేస్తున్నాం. ప్రత్యేక నిఘా పెట్టాం. నకిలీ పురుగు మందులు, లైసెన్స్ లేకుండా పురుగు మందులు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తప్పవు.

– ధనంజయరెడ్డి, వ్యవసాయశాఖ ఏడీ, కలెక్టరేట్



'స్కిల్' పూర్తయితే ఉపాధి



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: జిల్లాలోని పాలిటెక్నిక్ డిప్లొమా, ఐటీఐ కాలేజీల్లో స్కిల్ డెవలప్‌మెంట్ నేతృత్వంలో శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సమీపంలోని పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చూపాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆయన మంగళవారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు శిక్షణ పొందుతున్న ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలను సమీపంలోని పరిశ్రమలకు మ్యాపింగ్ చేయాలన్నారు. ఆ మేరకు కోర్సు పూర్తి చేసుకున్న తర్వాత అదే పరిశ్రమల్లో విద్యార్హతను బట్టి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని చెప్పారు. నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి ఆర్.లోకనాథం, డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు, మెప్మా పీడీ రాధమ్మ, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

రేపు జిల్లా టీ-20 క్రికెట్ జట్టు ఎంపిక

పాకాల: మండలంలోని దామలచెరువు జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో జిల్లా టీ-20 క్రికెట్ జట్టును గురువారం ఎంపిక చేయనున్నట్లు రూరల్ క్రీడల అభివృద్ధి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి అద్వైత్, ఆర్గనైజేషన్ కార్యదర్శి లవకుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం వారు మాట్లాడుతూ టీ-20 క్రికెట్ జట్టు ఎంపిక ప్రక్రియ అండర్-16, అండర్-19 సీనియర్ విభాగం విధానంలో జరుగుతుందని తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు గురువారం దామలచెరువు జెడ్పీ హైస్కూల్‌లో జరిగే టీ-20 క్రికెట్ పోటీలకు హాజరవ్వాలని, వివరాలకు 63094 02839, 97015 15415 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ముగిసిన అధ్యాపకుల శిక్షణ



అధ్యాపకులతో ట్రైనింగ్ సెంటర్ శిక్షకులు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీలో మదనమోహన మాలవీయ టీచర్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా శాన్‌స్క్రిట్ అండ్ ఇట్స్ కాంటెంపరరీ రిలవెన్స్ అనే అంశంపై జరిగిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం మంగళవారం ముగిసింది. ప్రాచీన అంశాలను ఆధునిక పద్ధతులలో విద్యార్థులకు బోధించాల్సిన మెళకువలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధ్యాపకులకు శిక్షణనిచ్చారు. అలాగే అధ్యాపకులు నిరంతర విద్యార్థిగా అధునాతన అంశాలపై నైపుణ్యం పెంచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మదనమోహన్ మాలవీయ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ మురళీధర్‌రావు, డాక్టర్ ఏ.చారుకేష్, దేశంలోని పలు విశ్వవిద్యాలయాల నుంచి శిక్షణ కోసం విచ్చేసిన సుమారు 35 మంది అధ్యాపకులు పాల్గొన్నారు.

వైద్యమిత్రల సమ్మె సైరన్!

ఈనెల 29న ముహూర్తం
- డిమాండ్ల పరిష్కారమే లక్ష్యం
- లేనిపక్షంలో సమ్మెలోకి వెళ్లాలని నిర్ణయం
- సమ్మె చేస్తే ఆరోగ్యశ్రీ సేవలు దూరం

చిత్తూరు రూరల్: కూటమి ప్రభుత్వం చిరుద్యోగులపై కక్షగట్టింది. కొత్తగా ఉద్యోగాల భర్తీని అటుంచితే ఉన్న ఉద్యోగాల్లో కోతలు పెడుతోంది. విభాగాల వారీగా చిరుద్యోగులను ముప్పుతిప్పలకు గురిచేస్తోంది. ఇందులో భాగంగా ఆరోగ్య మిత్ర సేవలను ప్రయివేటు పరంచేసి.. ఉన్న ఉద్యోగులను వీధిన పడేయాలని భావిస్తోంది. దీన్ని నిరసిస్తూ.. తమ డిమాండ్ల సాధన కోసం పోరుబాట పట్టేందుకు వైద్య మిత్రలు సిద్ధమైపోయారు. ఇప్పటికే ఏపీ వైద్య మిత్ర కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ తరఫున జిల్లా అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. వాటిని పరిష్కరించని పక్షంలో సమ్మెలోకి వెళ్లాలని నిశ్చయించుకున్నారు. వీరు సమ్మెలోకి వెళ్తే ఆరోగ్యశ్రీ సేవలకు ఆటంకం ఏర్పడే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



అధికారులకు వినతి పత్రం అందజేస్తున్న ఆరోగ్య మిత్రలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆయుష్

దివంగత మహానేత వైఎస్.రాజశేఖరరెడ్డి మరణానంతరం 2014–19 మధ్యకాలంలో చంద్రబాబు ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని పేరు మార్చింది నిధులివ్వకుండా నిర్వీర్యం చేసింది. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ఆరోగ్యశ్రీ పథకానికి పూర్వవైభవం తీసుకొచ్చారు. ఆరోగ్యశ్రీలో 3,254 జబ్బులకు చికిత్సలు చేసేలా రూపకల్పన చేశారు. వైద్య చికిత్స పరిమితి రూ.25 లక్షలకు పెంచారు. ఆరోగ్యశ్రీలో పనిచేసే సిబ్బంది వేతనం రూ.1,500కు పెంచారు. ఎన్నికల ఫలితాల అనంతరం ప్రభుత్వం మారడంతో వైద్యమిత్రలు తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఆరోగ్యశ్రీ అధికారులకు సమ్మె నోటీసు అందించారు.

17 ఏళ్లుగా సేవలు

తిరుపతి జిల్లాలో 143 ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులున్నాయి. వీటి పరిధిలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో 105 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రయివేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేయించుకునే వారి వివరాలు అప్లోడ్ చేసేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. వీరు ఆస్పత్రిలో ఏ రకమైన సమస్యకు ఎలాంటి చికిత్స ఉంటుందో తెలియజేసి, అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేయించి ప్రభుత్వం మంజూరు చేసిన నగదును అందిస్తున్నారు. ఇలా 17 ఏళ్లుగా రోగులకు సేవలందిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆరోగ్యశ్రీ పథకం పేరును ఎన్టీఆర్ వైద్యసేవగా మార్చింది. అలాగే వైద్యమిత్రలను తొలగించి ప్రైవేటుకు అప్పగించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో ఎన్టీఆర్ వైద్య సేవ సిబ్బంది సమ్మెకు సిద్ధమవుతున్నారు.

తిరుపతి జిల్లాలోని ఆరోగ్యశ్రీ ఆస్పత్రులు

ప్రభుత్వ నెట్‌వర్క్ ఆస్పత్రులు	74
ప్రైవేటు ఆస్పత్రులు	37
డెంటల్ క్లినిక్‌లు	32
మొత్తం	74

ఆరోగ్యశ్రీ విభాగంలో పనిచేసేవారు

జిల్లా కో–ఆర్డినేటర్	1
జిల్లా మేనేజర్	1
ఆఫీస్ అసిస్టెంట్	1
డీఈఓ	2
టీమ్ లీడర్స్	5
ఆరోగ్య మిత్రలు	105

డిమాండ్లు
- ఆరోగ్యశ్రీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ సిబ్బందిని 17 ఏళ్ల సర్వీసును పరిగణలోకి తీసుకుని క్యాడర్ కల్పించి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి. ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలి.
- ట్రస్ట్ ఫీల్డ్ సిబ్బందికి నిర్వహించిన వన్‌టైం ఎగ్జామ్‌ని ఉపసంహరించుకోవాలి
- ఫీల్డ్ సిబ్బంది అంతర్గత పదోన్నతులు కల్పించాలి
- చనిపోయిన సిబ్బందికి రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలి.
- ఉద్యోగ విరమణ చేసిన వారికి, ఉద్యోగ విరమణ చేయబోయే వారికి రూ.10 లక్షల గ్రాట్యుటీ ఇవ్వాలి.

2025 నాటికి చిన్నపిల్లల ఆస్పత్రి నిర్మాణం పూర్తి!

తిరుపతి(అలిపిరి): ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న శ్రీపద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రి నిర్మాణాన్ని 2025 నాటికి పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను టీటీడీ జేఈఓ గౌతమి ఆదేశించారు. మంగళవారం ఆమె ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం జేఈఓ మాట్లాడుతూ ఈ చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఆరు అంతస్తులతో 50 వేల ఎస్ఎఫ్‌టీ విస్తీర్ణంలో నిర్మిస్తున్నట్లు తెలిపారు. టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం అద్భుతమైన సేవలు అందిస్తోందని చెప్పారు. నూతనంగా నిర్మించే చిన్నపిల్లల ఆస్పత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అంతకుముందు ఆస్పత్రి నిర్మాణ పనులపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్విమ్స్ డైరెక్టర్ డా. ఆర్వీ కుమార్, సీఈ సత్యనారాయణ, శ్రీపద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి డైరెక్టర్ డా.శ్రీనాథ్‌రెడ్డి, ఎస్ఈ ఎలక్ట్రికల్ వెంకటేశ్వర్లు, ఈఈలు కృష్ణారెడ్డి, మల్లికార్జునప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణంలో ఉన్న శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి



ఆస్పత్రి భవనాలను పరిశీలిస్తున్న జేఈఓ గౌతమి



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు రూ.80,490
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.7,290

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో) రూ.1,00,600
రిటైల్ వెండి గ్రాము రూ.103.60

క్లుప్తంగా

రేషన్ బియ్యం స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

సైదాపురం: మండలంలోని చీకవోలు గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 260 కిలోల రేషన్ బియ్యాన్ని సోమవారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అందించిన వివరాల మేరకు మండలంలోని చీకవోలు గ్రామానికి చెందిన రమణయ్య ఇంట్లో రేషన్ బియ్యం ఉన్నట్లు సమాచారం అందడంతో దాడులు పోలీసులు దాడులు నిర్వహించారు. అక్కడ అక్రమంగా నిల్వ ఉంచిన 260 కేజీల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని బిరదవాడ గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని హరి అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం.. మేనకూరు సెజ్ పరిధిలోని ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తున్నా పశ్చిమ బెంగాల్‌కు ప్రాంతానికి చెందిన హరి బిరదవాడ గ్రామ సమీపంలో రోడ్డు పక్కన నడిచివెళ్తున్నాడు. నెల్లూరు వైపు వెళుతున్న గుర్తుతెలియని వాహనం అతనిని ఢీకొని నిలపకుండా వెళ్లిపోయింది. గాయపడిన హరిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

యథేచ్ఛగా ఇసుక దోపిడీ

- తొట్టంబేడు, వెంకటగిరి, శ్రీకాళహస్తికి తరలింపు
- ఆందోళనలో రైతులు



స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

పెళ్లకూరు: స్వర్ణముఖి నదిలో విచ్చలవిడిగా ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. వెంకటగిరి, శ్రీకాళహస్తి పట్టణాలకు పట్టపగలే యథేచ్ఛగా ట్రాక్టర్లలో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మంగళవారం స్వర్ణముఖినది నుంచి ఇసుక అక్రమంగా వెంకటగిరికి రవాణా చేస్తున్న ట్రాక్టర్లను కలవకూరు గ్రామం వద్ద గ్రామస్తులు అడ్డుకొని పోలీసులకు సమాచారం అంచారు. కానీ ఎవ్వరూ స్పందించలేదు. కొందరు పోలీసులు చేతివాటం ప్రదర్శించడంతో అక్రమార్కులు రేయింబవళ్లు రెచ్చిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పుల్లూరు, ముమ్మారెడ్డిగుంట, కలవకూరు గ్రామాల కేంద్రంగా కొందరు ట్రాక్టర్ యజమానులు, తొట్టంబేడు, వెంకటగిరి, శ్రీకాళహస్తి మండలాలకు చెందిన మరికొందరు ఇసుక వ్యాపారులు యథేచ్ఛగా ఇసుక రవాణా చేస్తున్నారని తెలిపారు. స్వర్ణముఖినదికి ఇరువైపుల పదివేల ఎకరాలకు పైగా వ్యవసాయ భూములకు సాగునీరు, 20 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. నదికి ఇరువైపుల వ్యవసాయ విద్యుత్ మోటార్ల కింద 10 వేల ఎకరాలకు పైగా పంటలు సాగుచేస్తున్నారు. ఇసుక అక్రమ తవ్వకాల వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లా ఎస్పీ స్పందించి అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

వాహనం సహా ఎర్రచందనం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కారు, ఎర్రచందనం దుంగలతో అటవీ అధికారులు

భాకరాపేట: వాహనం సహా ఎర్రచందనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట ఫారెస్టు రేంజర్ ఎస్. వెంకట్రమణ తెలిపారు. మంగళవారం భాకరాపేట ఫారెస్టు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఆ వివరాలను వెల్లడించారు. సోమ వారం రాత్రి అందిన సమాచారం మేరకు చిన్నగొట్టిగల్లు మండలం, దేవరకొండ రహదారి మార్గంలోని పులబోనుపల్లె సమీపంలో తమిళనాడుకు చెందిన వ్యక్తులు ఎర్రచందనం దుంగలు కారులోకి లోడ్ చేస్తున్నట్టు సమాచారం వచ్చిందన్నారు. ఆ మేరకు పులబో నుపల్లె సమీపంలోని రహదారిలో మాటు వేశామన్నారు. మంగళవారం తెల్లవారు జాము 2 గంటల ప్రాంతంలో వస్తున్న కారును ఆపేందుకు ప్రయత్నించగా అతి వేగంగా వెళ్లడంతో దాన్ని వెంబడించి కమ్మపల్లె వద్ద అడ్డుకున్నట్టు వెల్లడించారు. కారు ఆపిన ఇద్దరు నిందితులు చీకట్లోకి పారిపోయారన్నారు. కారులో 181 కిలోల బరువు గల 6 దుంగలు ఉన్నట్టు గుర్తించి, స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. డీఎల్ 4సీ ఎహెచ్ 5933 కారు సహా, ఎర్రచందనం విలువ రూ.8 లక్షలు ఉంటుందన్నారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నట్టు తెలిపారు. దాడుల్లో అటవీ సిబ్బంది ప్రదీప్‌కుమార్, ప్రదీప్‌చాంద్, రాజేష్‌కుమార్, నిఖిల్, శంకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాతకాల్వలో భూ రగడ

- రౌడీ షీటర్లతో దౌర్జన్యం
- కాపాడాలంటూ బాధితుల వేడుకోలు

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, పాతకాల్వ పంచాయతీలో భూరగడ రాజుకుంది. రౌడీషీటర్లు, గంజాయి బ్యాచ్‌తో కొందరు పట్టా భూమిని దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారని బాధితులు హేమంత్ ఆచారి, పద్మజ, నాగరాజు, జగన్నాథ్‌రావు ఆరోపించారు. బాధితుల కథనం.. పంచాయతీలోని పేరూరు రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబర్ 197/1లోని తాము కొనుగోలు చేసిన పట్టా భూమిలోని ప్లాట్లను హద్దులు మార్చి కల్పన అనే మహిళా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని బాధితులు వాపోయారు. అనధికారికంగా నమోదు చేసుకున్న హద్దులతో లేఅవుట్‌లోని ప్లాట్లను కబ్జా చేస్తున్నారని, మంగళవారం దౌర్జన్యంగా ప్రహరీ కూడా నిర్మించేందకు తెగబడ్డారని వాపోయారు. అడ్డుకునేందుకు వెళ్లిన తమను రౌడీషీటర్లతో దాడి చేయిస్తున్నారని కన్నీరుమున్నీరుగా విలపించారు. తిరుపతి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూమిని ఆక్రమించడమే కాకుండా, దాడి చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని, తమకు రక్షణ కల్పించాలని వేడుకున్నారు. దీనిపైన రూరల్ సీఐ చిన్నగోవిందును వివరణ కోరగా, సమాచారం వచ్చిందని, బాధితుల ఫిర్యాదును విచారించి న్యాయం చేస్తామన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు చిట్టమూరు విద్యార్థి



విద్యార్థి వాసుతో పీడీ భరత్ మహిపతి

చిట్టమూరు(వాకాడు): మండల కేంద్రమైన చిట్టమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి దారా వాసు(9వ తరగతి) రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం మీనాకుమారి తెలిపారు. ఆమె మాట్లాడుతూ మంగళవారం నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలలో విద్యార్థి వాసు విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. నవంబర్ 5వ తేదీన విజయనగరం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటాడని తెలిపారు. అనంతరం విద్యార్థినిని ఉపాధ్యాయులు, పాఠశాల పీడీ భరత్ మహిపతి అభినందించారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- 362 గ్రాముల బంగారం, రూ.3.55 లక్షల నగదు స్వాధీనం
- మరో ఏడుగురు బైండోవర్
- వివరాలు వెల్లడించిన క్రైం డీఎస్పీ రమణకుమార్



మాట్లాడుతున్న క్రైం డీఎస్పీ రమణకుమార్

తిరుపతి రూరల్: తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కుటుంబ సమేతంగా దొంగతనాలకు పాల్పడే అంతర్రాష్ట్ర దొంగల ముఠాను తిరుపతి రూరల్ పోలీసులు వలపన్ని మంగళవారం పట్టుకున్నారు. ఇద్దరు దొంగలను అరెస్ట్ చేయడంతో పాటు రూ.10.31 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.3.55 లక్షల నగదును రికవరీ చేశారు. మంగళవారం తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో క్రైం డీఎస్పీ రమణకుమార్, రూరల్ సీఐ చిన్నగోవిందు ఆ వివరాలను వెల్లడించారు. సెప్టెంబర్ 20వ తేదీన తిరుపతి రూరల్ మండలం, ఓటేరు పంచాయతీ పరిధిలో ఒకేరోజు మూడు ఇళ్లలో దొంగతనం జరిగింది. కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు దొంగలను కనిపెట్టేందుకు నాలుగు బృందాలుగా విడిపోయి విస్తృతంగా గాలించారు. చెన్నైకి చెందిన శెట్టి మణి, శెట్టి సూర్య, శెట్టి విజయ్ కుటుంబ సమేతంగా చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. గత నెల 30న ఇద్దరు మహిళా దొంగలను అరెస్ట్ చేశారు. తాజాగా ఈ చోరీల్లో సిద్ధహస్తులైన శెట్టి మణి, శెట్టి సూర్యను మంగళవారం రామానుజపల్లి సర్కిల్ సమీపంలో అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. వారి నుంచి 362 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.3.55 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. పరారీలో ఉన్న శెట్టి విజయ్‌ను త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ చూపిన రూరల్ సీఐ చిన్నగోవిందు, ఎస్ఐ షెక్షావలీ, క్రైమ్ ఏఎస్ఐ రాఘవనాయుడు, సిబ్బందిని అభినందించారు. వారికి రివార్డులను అందించాలని సిఫార్సు చేసినట్లు చెప్పారు.

విద్యుత్ బస్సులపై ఢిల్లీ పెత్తనం

తిరుపతి అర్బన్: బస్సుల నిర్వహణ బాధ్యతలను ఢిల్లీకి చెందిన ఎస్అండ్‌పి ప్రొటక్షన్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు విద్యుత్ అప్పగించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తిరుమలకు రెండేళ్ల క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యుత్ బస్సులను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అలిపిరి డిపో కేంద్రంగా తిరుమలకు 50 సర్వీసులు, రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌కు 14 సర్వీసులు, కడపకు 12, మదనపల్లికి 12, నెల్లూరుకు 12 సర్వీసులను నడుపుతున్నారు. గత ప్రభుత్వంలో అలిపిరి డిపోలో ఏర్పాటు చేసిన హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కళాశాలలో శిక్షణ పొందిన డ్రైవరకు విద్యుత్ బస్సుల్లో డ్రైవర్లుగా పనిచేసే అవకాశాన్ని కల్పించారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ బస్సుల నిర్వాహణను గాలికొదిలేసింది. ప్రధానంగా డ్రైవర్లకు సకాలంలో జీతాలు ఇవ్వకపోవడంతో వారు పదేపదే అలిపిరి డిపో వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఓ డ్రైవర్ ఆత్మహత్య చేసుకోవడానికి సైతం సిద్ధమయ్యాడు. అయితే విద్యుత్ బస్సులను నిర్వహిస్తున్న విజయవాడకు చెందిన ఎస్ఎస్‌వీ ఎంటర్ ప్రైజస్ సంస్థ నిర్వహణ సక్రమంగా లేదని.. దాంతోనే ఇబ్బందులు వస్తున్నాయని భావించారు. ఆ సంస్థను తొలగించి.. మంగళవారం నుంచి కొత్తగా ఢిల్లీకి చెందిన ఎస్అండ్‌పి ప్రొటక్షన్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించారు.

పకడ్బందీగా కనీస వేతన చట్టం

తిరుపతి అర్బన్: కార్మికుల కనీస వేతనాల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో 2024–25కు సంబంధించి కనీస వేతనాల సవరణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న నైపుణ్యం లేని గ్రామీణ ప్రాంతాల ఉద్యోగులకు రోజుకు రూ.538, మున్సిపాలిటీ పరిధిలో రూ.621, కార్పొరేషన్ పరిధిలో రూ.677 ఇవ్వాలన్నారు. అలాగే అర్ధ నైపుణ్యం కల్గిన ఉద్యోగులకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.565, మున్సిపాలిటీల్లో రూ.652, కార్పొరేషన్ పరిధిలో రూ.712 ఇవ్వాలని చెప్పారు. నైపుణ్యం కలిగిన ఉద్యోగులకు గ్రామీణ ప్రాంతాల్లో రూ.594, మున్సిపాలిటీల్లో రూ.685, కార్పొరేషన్ పరిధిలో రూ.749 అందించాలని స్పష్టం చేశారు. డెప్యూటీ లేబర్ కమిషనర్ ఓంకార్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ చిన్న లాలప్ప, తిరుపతి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి ఆర్డీఓలు రామ్మోహన్, కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

బంధువుల గొడవ.. యువకుడి హత్య

- ముత్యాలపాడులో ఉద్రిక్తత
- గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు



దాడిలో మృతి చెందిన హరిప్రసాద్ (ఫైల్)

చిల్లకూరు: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో బంధువుల మధ్య వివాదం నేపథ్యంలో సోమవారం అర్ధరాత్రి తర్వాత ఒక యువకుడు హత్యకు గురయ్యాడు. గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు తెలిపిన మేరకు.. ముత్యాలపాడులో నారప రెడ్డి శ్రీధర్‌రెడ్డి, అతడి అన్న కుమారుడు వెంకటకృష్ణయ్య కుటుంబాల మధ్య సోమవారం రాత్రి స్వల్ప వివాదం నెలకొంది. ఈ వివాదం ఇరువర్గాల దాడులకు దారి తీసింది. పలువురు గాయపడ్డారు. వాహనాలను ధ్వంసం చేసుకున్నారు. శ్రీధర్‌రెడ్డి వర్గీయులు ముత్యాలపాడు నాంచారమ్మపేటలో రెండో వర్గానికి చెందిన మధు కారును ధ్వసం చేశారు. అనంతరం శ్రీధర్‌రెడ్డి మద్దతుదారులైన మల్లారపు హరిప్రసాద్ (20), కాటయ్య నిద్రిస్తున్న ఇంటిని వెంకటకృష్ణయ్య మద్దతుదారులు ముట్టడించారు. ఇంటిముందు ఉన్న బైక్‌ను దహనం చేశారు. పెట్రోల్ ఉన్న సీసాను ఇంట్లోకి విసిరి నిప్పంటించారు. మంటలు అధికం కావడంతో బయటకు పరుగులు తీస్తున్న హరిప్రసాద్, కాటయ్యలపై మూకుమ్మడిగా దాడిచేశారు. గాయపడిన కాటయ్య పక్కింట్లోకి వెళ్లి దాక్కున్నాడు. హరిప్రసాద్ తీవ్రంగా గాయపడ్డాడు. చుట్టుపక్కల వారు హరిప్రసాద్‌ను గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై పోలీసులు కేసు నమోదుచేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఈ గొడవల నేపథ్యంలో గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు గ్రామంలో పికెట్ ఏర్పాటుచేశారు. ఎస్పీ సుబ్బరాయుడు, ఏఎస్పీ, గూడూరు డీఎస్పీ, క్లూస్ టీంతో కలసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ కేసులో దిలీప్‌రెడ్డి, కమ్మయ్య, మల్లికార్జునరెడ్డి, మరొకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు



మహిళకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

చంద్రగిరి: గ్రామీణ ప్రాంతాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్‌కు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా ప్రోగ్రామ్ అధికారిణి డాక్టరు హరిత తెలిపారు. మండల పరిధిలోని దొర్నకంబాల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా అధికారులు మంగళవారం సందర్శించారు. గ్రామంలోని గర్భవతులకు వైద్య పరీక్షలు చేయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలును వారికి వివరించారు. గర్భవతులను, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం సచివాలయ వైద్య సిబ్బందితో సమీక్షించారు. సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. చంద్రగిరి పీహెచ్‌సీ వైద్యాధికారిణి శిరీష, ఎస్వో నాగేంద్రకుమార్, సూపర్‌వైజర్ నరేష్‌బాబు పాల్గొన్నారు.

తల్లిని అసభ్యంగా మాట్లాడాడని..!



నిందితుడిని అరెస్టు చూపుతున్న శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు, సీఐ శ్రీనివాసులు

శ్రీసిటీ(వరదయ్యపాళెం): తన తల్లిని అసభ్యంగా మాట్లాడాడనే కోపంతో ఓ వ్యక్తిపై నిందితుడు దాడిచేసి హత్య చేసినట్టు శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు తెలిపారు. మంగళవారం శ్రీసిటీ డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించి వివరాలను వెల్లడించారు. శ్రీసిటీ పారిశ్రామికవాడలో ఓ పరిశ్రమలో పనిచేస్తున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సికారి ముర్ముపై అదే రాష్ట్రానికి చెందిన సమీప బంధువు విక్రమ్‌ముర్ము ఇటీవల దాడిచేసి హత్య చేశాడు. తన తల్లిని అసభ్యంగా మాట్లాడాడనే కోపంతో దాడిచేసి హత్య చేసినట్టు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడు విక్రమ్‌ముర్మును శ్రీసిటీ పరిసర ప్రాంతాల్లో అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసి అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు డీఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో శ్రీసిటీ హైటెక్ పోలీస్ స్టేషన్ సీఐ టీవీ.శ్రీనివాసులు, ఎస్ఐ హరిప్రసాద్ పాల్గొన్నారు.

హీరో పరిశ్రమలో భద్రతా ప్రమాణాల పరిశీలన



హీరో పరిశ్రమలో భద్రతా ప్రమాణాలను పరిశీలిస్తున్న అధికారుల బృందం

వరదయ్యపాళెం: నియోజకవర్గంలోని హీరో పరిశ్రమలో సోమవారం ప్రభుత్వ భద్రతా పర్యవేక్షణ అధికారుల బృందం మంగళవారం పర్యటించింది. ఈ మేరకు వసుధ మిశ్రా, ఐఏఎస్, ఫ్యాక్టరీస్ డైరెక్టర్ చంద్రశేఖర్, డైరెక్టర్ ఆఫ్ బాయిలర్స్ ఉమామహేశ్వరావు హీరో పరిశ్రమలో భద్రతా ప్రమాణాలకు సంబంధించి తీసుకున్న చర్యలపై పరిశీలించారు. పరిశ్రమ పూర్తిగా సందర్శించి బాయిలర్ల వద్ద, ఫైర్‌కు సంబంధించి అటు సిబ్బందికి, ఇటు పరిశ్రమ ఆవరణలో తీసుకున్న చర్యలను పరిశీలన చేశారు. వారికి పరిశ్రమకు చెందిన ప్లాంట్ హెడ్ నిహాల్ కౌల్, హెచ్ఆర్ హెడ్ మనోహర్ చక్రవర్తి, ప్లాంట్ పీఈ హెడ్ అనూప్ గుప్తా, చీఫ్ సెక్రటరీ కిరణ్ పరిశ్రమలో భద్రతా చర్యలకు సంబంధించి అధికారులకు వివరించారు. అన్నివిధాలా పరిశ్రమలో భద్రతా ప్రమాణాలను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అమలు చేయడంపై అధికారుల బృందం సంతృప్తి వ్యక్తం చేశారు.

షాట్‌పుట్‌లో బంగారు పతకం



క్రీడాకారుడిని అభినందిస్తున్న అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు

తిరుపతి ఎడ్యుకేషన్: గుంటూరులో ఈ నెల 17నుంచి 19వ తేదీ వరకు 35వ సౌత్ జోన్ జూనియర్ జాతీయ అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు తిరుపతికి చెందిన క్రీడాకారుడు బి.ప్రణీత్‌కుమార్ రాష్ట్రం తరపున అండర్–16 విభాగంలో పాల్గొన్నాడు. తన క్రీడా ప్రతిభతో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని కైవశం చేసుకున్నాడు. ఈ సందర్భంగా మంగళవారం తిరుపతిలో అతన్ని ఉమ్మడి చిత్తూరు జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎ.గిరిధర్‌రాజు, రాబర్ట్, కోచ్ ప్రసాద్, సభ్యుడు వెంకటేష్ సిద్ధిక్‌లు అభినందించారు.

భూ బాధితులకు సత్వర న్యాయం



తమ ఆవేదనను జేసీకి వివరిస్తున్న రైతులు

చంద్రగిరి: జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోయిన రైతులకు సత్వరం న్యాయం చేస్తామని చిత్తూరు జాయింట్ కలెక్టర్ విద్యాధరి హామీ ఇచ్చారు. మంగళవారం ఆమె స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తొండవాడ, చంద్రగిరి, అగరాల, మామండూరు, ముంగిళిపట్టు, కల్‌రోడ్డు పల్లి, పనపాకంకు చెందిన రైతులు, ఇళ్లు కోల్పోయిన బాధితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ భూమలకు పరిహారం ఇచ్చారేగానీ అందులోని చెట్లకు చెల్లించలేదని మామండూరు రైతు మధుబాబు తెలిపారు. తన పొలాన్ని రహదారికి తీసుకుని 2018లో రూ.40 లక్షలు పరిహారం ఇచ్చారని, అయితే దానిని జాతీయ రహదారి అధికారులు అడ్డంకులు సృష్టించి, కోర్టులో దావా వేశారంటూ పనపాకంకు చెందిన రైతు జేసీ దృష్టికి తీసుకెళ్లాడు. అగరాల పంచాయతీ బండకాదపల్లిలోని తమ ఇంటికి ఇంతవరకు పరిహారం చెల్లించలేదని బాధితులు ఫిర్యాదు చేశారు. కోటకు ఎదురుగా రహదారికి ఆనుకుని కాలువను కబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని, దీంతో వర్షపు నీరు ఎటూ వెళ్లకుండా పొలాలు, ఇళ్ల మధ్యకు వస్తోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. స్పందించిన జేసీ వెంటనే అక్రమ నిర్మాణాలను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. కుక్కలపల్లి–మల్లవరం 6 లేన్ల జాతీయ రహదారి విస్తరణతో పాటు కాలువలు, చెక్ డ్యామ్ నిర్మాణానికి మరికొంత భూమి అవసరం ఉందన్నారు. 1956 జాతీయ రహదారుల చట్టం–3జీ(4) గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం రైతులతో మాట్లాడి భూసేకరణ చేపట్టనున్నట్టు వెల్లడించారు. ఇప్పటికీ పరిహారం అందని రైతులకు వెంటనే అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పేదలకు న్యాయం చెయ్యండి

జాతీయ రహదారి విస్తరణలో భూములు, ఇళ్లు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. ఈ మేరకు ఆయన జేసీ విద్యాధరిను కలిసి సమస్యలు వివరించారు. పనపాకంలో భూములు ఇచ్చిన వారికి 5 సెంట్ల ఇంటి స్థలం ఇస్తామని చెప్పి, 3 సెంట్లు మాత్రమే మంజూరు చేసినట్టు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పరిహారాన్ని త్వరితగతిన ఇవ్వాలని జేసీకి సూచించారు.